సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



అట్టహాసంగా లాన్‌టెన్నిస్ పోటీలు

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కేవీ సత్యనారాయణ అన్నారు.



కల్ప, అశ్వవాహనాలపై ఊరేగిన దేవదేవుడు

వాడపల్లి శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి.

10లో

84 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 84,840 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.50 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,800 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

చట్ట పరిధిలో ఫిర్యాదులు పరిష్కరించాలి

– ఎస్పీ నరసింహ కిషోర్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం రూరల్: నిర్ణీత సమయంలో ప్రజల అర్జీలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ డి.నరసింహ కిషోర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఎస్పీ నరసింహ కిషోర్ వారి కష్టాలను స్వయంగా తెలుసుకుని, సంబంధిత స్టేషన్ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 28 ఫిర్యాదులు అందాయి. వీటిలో సివిల్ కేసులు, కుటుంబ తగాదాలు, చీటింగ్, కొట్లాట, చోరీలు తదితర ఫిర్యాదులు ఉన్నాయి. అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకటసుబ్బ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా సీతారామమూర్తి బాధ్యతల స్వీకరణ



సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లా రెవెన్యూ అధికారిగా తమరాల సీతారామమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1995లో ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీకాకుళం జిల్లా కవిట మండలంలో ప్రభుత్వ సర్వీస్‌లో చేరారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌గా శ్రీకాకుళం జిల్లా వంశధార ప్రాజెక్టు ల్యాండ్ అక్విజేషన్ అధికారిగా, ఏపీ సీఆర్డీఏ ల్యాండ్ పూలింగ్ విభాగంలో, మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్(ముడ), ల్యాండ్ అక్విజేషన్ బందర్ పోర్టు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా (కేఆర్ఆర్‌సీ) శ్రీకాకుళం జిల్లా ల్యాండ్ సర్వే ప్రాజెక్టులో, పలాస ఆర్డీఓగా, విశాఖపట్నం ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. తాజాగా బదిలీపై తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ డీఆర్‌ఓగా ఉన్న జి.నరసింహులు బదిలీపై తిరుపతి జిల్లాకు వెళ్లారు.

దుర్గమ్మకు బంగారు హారం



డీఈవో రత్నరాజుకు బంగారపు హారాన్ని అందజేస్తున్న దాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు రాజమహేంద్రవరానికి చెందిన భక్తులు సోమవారం బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. పీఅండ్‌టీ కాలనీకి చెందిన కేశవ శ్రీనివాసరెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చింది. డీఈవో రత్నరాజును కలిసి రూ.1.30 లక్షలు.. 18 గ్రాముల బంగారంతో తయారు చేసిన బంగారు హారాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందజేశారు.

నిర్ణీత వ్యవధిలో అర్జీలను పరిష్కరించాలి

– జేసీ చిన్నరాముడు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని జేసీ ఎస్ చిన్నరాముడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరిగింది. ప్రజల నుంచి 135 అర్జీలను స్వీకరించారు. డీఆర్‌ఓ తామరాల సీతారామమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ, అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీజీఆర్ఎస్ ఉండాలన్నారు. అర్జీదారుల విజ్ఞప్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, రీ ఓపెన్ లేకుండా చూడాలని సూచించారు.

ఆరోగ్యశ్రీపై కాలకూటమి విషం

- పేదల పథకాన్ని ఎత్తివేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర
- బృహత్తర పథకం స్థానంలో తెరపైకి బీమా
- ఆయుష్మాన్ భారత్ కార్డుల ద్వారా అమలుకు సన్నాహాలు
- ప్రైవేటు ఆస్పత్రుల నుంచి అభిప్రాయ సేకరణ
- త్వరలోనే నూతన పాలసీ తీసుకువచ్చేందుకు అడుగులు
- అదే జరిగితే నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం కలే..

పేదవాడి వైద్యంపై కూటమి పాలకులు విషం కక్కుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా.. లక్షల రూపాయల విలువైన వైద్యాన్ని కార్పొరేట్ స్థాయిలో పొందేలా బాటలు వేసిన దివంగత మహానేత వైఎస్సార్ ముద్రను ప్రజల హృదయాల నుంచి చెరిపేయడానికి కుయుక్తులు పన్నుతున్నారు. పేదల కష్టాలు తీర్చి, కన్నీరు తుడిచేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా తూట్లు పొడిచేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది.

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వం పగబట్టింది. నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన, కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఉద్దేశించిన ఆరోగ్యశ్రీ(ఎన్టీఆర్ వైద్య సేవ)కి మంగళం పాడే దిశగా పావులు కదుపుతోంది. ఈ పథకం స్థానే నూతన ఆరోగ్య పాలసీ అమలుకు సన్నాహాలు ప్రారంభించింది. బీమా(ఇన్సూరెన్స్) తీసుకొచ్చేందుకు వ్యూహ రచన చేస్తోంది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ పరిణామం ఇటు ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల్లో, అటు ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కొత్త పాలసీ అమలైతే పేదలకు కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షలా మారే అవకాశం ఉందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

వైఎస్సార్ పేరు మరిపించే కుట్ర..!


ఆరోగ్యశ్రీ అంటే గురుకొచ్చేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఈ పథకాన్ని దివంగత మహానేత ప్రారంభిస్తే.. సంస్కరణలను ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. దీంతో వైఎస్సార్, వైఎస్ జగన్ ప్రజలకు చేసిన మంచిని మరిపించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. అందులో భాగంగానే తండ్రీతనయుల మానసపుత్రిక అయిన ఆరోగ్యశ్రీని నామరూపాల్లేకుండా చేసేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఈ మేరకు రంగంలోకి దిగిన ప్రభుత్వం విధివిధానాలను పరిశీలిస్తోంది. ఇటీవల రాష్ట్ర స్థాయిలోని ఓ ఉన్నతాధికారి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా తీసుకువస్తున్నామని, సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే ఆస్పత్రుల యాజమాన్యాల నుంచి పూర్తి స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఆరోగ్యశ్రీ పథకమే ఉత్తమమన్న అభిప్రాయాన్ని ఏకకంఠంతో వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ కంటే మంచిగా బీమా ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని, ఆస్పత్రులకు సైతం మేలు చేకూరుతుందని ఉన్నతాధికారి ఒప్పించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది.

ఆయుష్మాన్ భారత్‌పై మక్కువెందుకో?

ఆరోగ్యశ్రీ స్థానంలో అయుష్మాన్ భారత్‌ను తీసుకురావడంపై కూటమి ప్రభుత్వం మక్కువ చూపుతోంది. పథకంలో వ్యాధుల సంఖ్య 1,900లోపే ఉంటుంది. ప్యాకేజీ సైతం తక్కువగా ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రులు ఆయుష్మాన్ భారత్‌పై అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసి, 1,900 వ్యాధులకు పైబడిన వ్యాధులను బీమా పరిధిలోకి తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే నయాపైసా చెల్లించకుండా వైద్యం చేయించుకునే పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర భారం పడనుంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తోంది. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే క్రమంలో జిల్లావ్యాప్తంగా 78 ఆస్పత్రులను ఎంపిక చేసింది. అందులో ప్రైవేటు ఆస్పత్రులు 43, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 5, ప్రైమరీ హెల్త్ సెంటర్లు 28, జీజీహెచ్, ఏరియా హాస్పిటల్ ఒక్కొక్కటి ఉన్నాయి. ఇవి కాకుండా మరో 16 దంత వైద్యశాలలు(ఈహెచ్ఎస్) సైతం వైద్య సేవలు అందిస్తున్నాయి. **జిల్లాలో 5.12 లక్షల మంది ఆరోగ్యశ్రీ కార్డుదారులున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని అభాసుపాలు చేశారు. 2019లో** అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇందులో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. తండ్రి (దివంగత ముఖ్యమంతి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి) శ్రీకారం చుట్టిన పథకానికి తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు తెచ్చి.. ప్రజలకు మరింతగా అండగా ఉండేలా చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 938 వ్యాధులతో ప్రారంభమైన ప్రస్థానం ఏడాదిలోనే 2,436 రకాల వ్యాధులను చేర్చింది. వాటిని మరింత పెంచుతూ 3,275 వ్యాధుల వరకు విస్తరించింది.



జిల్లాలో వైఎస్సార్ సీపీ హయాంలో వైద్యం వివరాలు ఇలా..

సంవత్సరం	వైద్యం, శస్త్రచికిత్స పొందిన వారు	మంజూరైన మొత్తం (రూ.కోట్లలో)
2019–2020	25,750	62.71
2020–2021	29,602	62.15
2021–2022	47,039	89.48
2022–2023	1,46,414	294.15

ఇతర రాష్ట్రాల వారు ఎవరైనా ఇక్కడ రోడ్డు ప్రమాదానికి గురైతే, వారికి ఏ ఆస్పత్రిలోనైనా ఉచితంగా చికిత్స అందించే ఏర్పాట్లు చేశారు.

రూ.508.49 కోట్ల వెచ్చింపు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లలో పథకం అమలుకు భారీగా ఖర్చు చేసింది. 2023 వరకు రూ.508,49,95,571 వైద్యం, శస్త్రచికిత్సలకు వెచ్చించింది. మొత్తం 2,48,805 మందికి వైద్యం పొంది సంపూర్ణ ఆరోగ్యవంతులయ్యారు. ప్రతి ఏటా రూ.50 కోట్లకు పైనే నిధులు ప్రజారోగ్యం కోసం ఖర్చు చేశారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం స్కీం వర్తింపజేశారు. గుండె, లివర్ ప్లాంటేషన్, క్యాన్సర్ వంటి ఖరీదైన శస్త్ర చికిత్సలకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు.

ఖరీదైన వ్యాధులకు నిధుల వెచ్చింపు

ఆరోగ్యశ్రీలో ఖరీదైన వ్యాధులకు సైతం చికిత్స అందిస్తున్నారు. బైలాట్రల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్‌కు రూ.11.97 లక్షలు, అల్లోజెనిక్ బోన్‌మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్(14ఏళ్ల పైన) రూ.11 లక్షలు, గుండె మార్పిడికి రూ.10.77 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇలాంటి వ్యాధులు సైతం ఆరోగ్యశ్రీలో నయా పైసా చెల్లించకుండా చికిత్స పొందే వెసులుబాటు ఉంది.

ఉద్యోగులు గరంగరం

ఆరోగ్యశ్రీ పథకం ఎత్తివేత నిర్ణయంపై ఆ శాఖ ఉద్యోగులు మండిపడుతున్నారు. వైద్య మిత్రలు సమ్మెలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. తమ సమస్యలకు పరిష్కారం చూపకపోతే సమ్మెలోకి వెళతామని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. సమ్మె నోటీసును సైతం జారీ చేశారు. మరోవైపు ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా పథకం అమలు చేస్తున్నారు. అందులో తమను తీసుకుంటారా? లేక బీమా కంపెనీ ఉద్యోగులే నూతన పథకాన్ని అమలు చేస్తారా? అన్న మీమాంస నెలకొంది. తమకు ఉద్యోగ భద్రత కరువైందని జిల్లాలో 67 మంది ఆరోగ్యశ్రీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు, ఉద్యోగుల భద్రతపై ఉన్నతాధికారులు ఉద్యోగులతో జరిపిన చర్చల్లో కాస్త పురోగతి కనిపించింది. అధికారులు సానుకూలంగా స్పందించడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా బాటలో విలీనం చేసే వ్యవహారంపై మాత్రం అధికారులు ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం చేయాలి

– వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరిఫ్



సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): దేశంలోని తొమ్మిది లక్షల ఎకరాల వక్ఫ్ భూములను అన్యాక్రాంతం చేసి, ముస్లింలకు తీవ్ర నష్టం చేకూర్చే వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం సమాజానికి జీవన్మరణ సమస్యగా మారిందని వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ ఆరిఫ్ అన్నారు. సోమవారం ఇక్కడ తన కార్యాలయంలో మాట్లాడుతూ, ఆ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ, ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలన్నారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారని, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో సభా పక్ష నేతలైన లోకసభ ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి ఈ బిల్లును వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. టీడీపీ, జనసేన ఎంపీలు కూడా ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసేలా ఆదేశించాలని కోరారు. దేశ వ్యాప్తంగా ముస్లిం సంఘాలు పోరాటానికి సిద్ధమవుతున్నాయని, మన రాష్ట్రంలో అన్ని ముస్లిం సంఘాలను కలిపి అఖిలపక్షాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. తద్వారా అన్ని పార్టీలపైనా ఒత్తిడి పెంచుతామన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కర్నూలులో వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి, రిటైర్డ్ జడ్జిని నియమించిందని గుర్తుచేశారు. ఆటువంటి వక్ఫ్ ట్రిబ్యునల్‌కు వ్యతిరేకంగా కలెక్టర్లకు అధికారాలు కట్టబెట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూటమి ఎంపీల మద్దతుతో కేంద్రం నిలబడిందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకునేలా ఆ ఎంపీలు వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

వేతన సమస్యను పరిష్కరించాలి

– ఓఎన్‌జీసీ కాంట్రాక్ట్ డ్రైవర్ల ధర్నా



బేస్ కాంప్లెక్స్ వద్ద ఆందోళన చేస్తున్న డ్రైవర్లు, నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ డ్రైవర్ల వేతన సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ డిమాండ్ చేశారు. ఓఎన్‌జీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ మెయిన్ గేటు వద్ద కారు డ్రైవర్లు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ, బేస్ కాంప్లెక్స్‌లో 350 మందికి పైగా డ్రైవర్లు కాంట్రాక్ట్ వర్కర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్లు, యాజమాన్యం ఒప్పంద నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. కేంద్ర కార్మిక శాఖ నిర్దేశించిన కనీస వేతనంతో పాటు, అదనంగా 35 శాతం ఫెయిర్ వేజ్ ఇచ్చేందుకు అంగీకరించిన వారే టెండర్లు వేసేందుకు అనుమతి ఉందని గుర్తు చేశారు. రెండేళ్ల క్రితం వరకూ నెలకు రూ.22 వేల నుంచి రూ.25 వేల వేతనం ఉండేదని తెలిపారు. కొత్త కాంట్రాక్టర్ రెండేళ్లుగా నెలకు రూ.14 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు ముచ్చర్ల సత్యనారాయణ, దొమ్మటి సోమశంకర్, ఏవీవీ సత్యనారాయణ ఈ ఆందోళనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ మూర్తి, కేఎస్‌వీ రామచంద్రరావు, బి.పూర్ణిమరాజు, బి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మద్యం విక్రయాలు



చింతాడ లావణ్య

రాజమహేంద్రవరం రూరల్: నూతన మద్యం పాలసీని పకడ్బందీగా అమలు చేయడానికి నిరంతర కృషి చేస్తామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతాడ లావణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 125 మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యాపారులకు కేటాయించినట్టు చెప్పారు. లైసెన్సుల జారీ ప్రక్రియ ఈ నెల 31తో ముగుస్తుందన్నారు. మద్యాన్ని ఎమ్మార్పీ రేట్లకే విక్రయించాలని చెప్పారు. అధిక ధరలకు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ చట్టరీత్యా నేరమని, వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సారా, కల్తీ కల్లు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

చిరకాల వాంఛకు చిక్కులెన్నో..



సఖినేటిపల్లి–నర్సాపురం రేవులో వంతెన లేక పంటుపై ప్రయాణిస్తున్న జనం

- కోనసీమ–పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య వంతెనకు బాలారిష్టాలు
- టీడీపీ సానుభూతిపరులే మోకాలడ్డు
- పూర్తయిన భూసేకరణ
- రూ.600 కోట్లు సిద్ధం.. టెండర్లు తెరవడమే తరువాయి
- నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషితో ప్రాజెక్టుకు రూపకల్పన


మలికిపురం: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ–పశ్చిమగోదావరి జిల్లాల మధ్య వశిష్ట గోదావరి నదిపై తలపెట్టిన చిరకాల వాంఛ అయిన వంతెన నిర్మాణం చిక్కులను అధిగమించలేకపోతోంది. 2021లో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ వంతెన మంజూరు చేయించారు. భూసేకరణలో గుడిమెళ్లంకకు చెందిన కూటమి సానుభూతి పరులు కోర్టుకు వెళ్లడం వల్ల వైఎస్ జగన్ చేయాల్సిన భూమి పూజ రెండుసార్లు వాయిదా పడింది. కేవలం ఒక్క గుడిమెళ్లంకలో ప్రధానపంట కాలువపై ఫ్లైఓవర్ నిర్మాణం జరిగే చోటు మార్చాలని రైతు కోర్టుకెళ్లారు. 2021లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో కేంద్ర జాతీయ రహదారుల శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. గతంలో ఇచ్చిన హామీ కంటే గతంలో రూపొందించిన ప్లాన్, డిజైన్ కంటే మిన్నగా వంతెన, రోడ్డు నిర్మాణానికి ప్రస్తుతం నిధులు కేటాయింపు జరిగింది. వంతెనతో పాటు జాతీయ రహదారి 216కి అనుసంధానంగా బైపాస్ రోడ్డు కూడా ఈ వంతెన మీదుగా నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించి తగిన నిధులు కూడా కేటాయించారు. సఖినేటిపల్లి–నర్సాపురం ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దిగువన రామేశ్వరం–రాజుల్లంకల వద్ద వంతెన నిర్మాణం జరుగుతుంది. నర్సాపురం, రాజోలు నియోజకవర్గ ప్రజలకు పూర్తి స్థాయి ప్రయోజనాలు కలగడంతో పాటు కోస్తా జిల్లాల వ్యాపార వాణిజ్య రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని దీన్ని డిజైన్ చేశారు. ఇందుకు 2021లో తొలి విడతగా రూ.400 కోట్లు కేటాయించారు. వంతెన, రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం తొలి విడతగా రూ.65 కోట్లు విడుదల చేశారు. వంతెన కోసం ఉభయ జిల్లాల్లోనూ 38 హెక్టార్ల భూమి సేకరించారు. నగదు చెల్లింపులు కూడా దాదాపు పూర్తయ్యాయి.

వంతెన– రోడ్డు నిర్మాణం ఇలా..

సఖినేటిపల్లి–నర్సాపురం మధ్య తలపెట్టిన వంతెన, రోడ్డు నిర్మాణం స్వల్ప మార్పులతో డిజైన్‌ను అన్ని విధాలా ప్రజలకు ప్రయోజనకరంగా రూపొందించారు. కోనసీమ జిల్లాలో మలికిపురం మండలం దిండి వద్ద జాతీయ రహదారి నుంచి బైపాస్ మార్గం ప్రారంభం అవుతుంది. రామరాజులంక, పెదతిప్ప, గుడిమెళ్లంక, మలికిపురం, సఖినేటిపల్లి మండలంలో టేకిశెట్టిపాలెం అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి, రామేశ్వరం మీదుగా గోదావరి నది దాటి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి రాజుల్లంక, పీచుపాలెం, మీదుగా సీతారామపురంలో జాతీయరహదారి 216కు అనుసంధానమవుతుంది. మొత్తం 23.2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం అవుతుంది. ఇందులో రాజుల్లంక–రామేశ్వరం మధ్య గోదావరి నదిపై 1100 మీటర్ల పొడవున వంతెన నిర్మాణం జరుగుతుంది.

జగన్ ప్రభుత్వంలోనే..

సఖినేటిపల్లి–నర్సాపురం రేవు ఉమ్మడి గోదావరి జిల్లాల మధ్య వశిష్ట గోదావరి నది మధ్య ఉంది. సుమారు వందేళ్లుగా ఇక్కడ వంతెన డిమాండ్ ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు మండలాల ప్రజలు పశ్చిమ గోదావరి జిల్లాలో నర్సాపురం, మొగల్తూరు, మండలాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి కూడా సఖినేటిపల్లి రేవులో వంతెన కావాలని పోరాటం చేస్తూనే ఉన్నారు. 1910లో కూడా ఇక్కడ వంతెన నిర్మాణానికి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం రూ.70 వేలు మంజూరు చేసింది. అయితే అది సాధ్యం కాలేదు. అనంతరం మాజీ మంత్రి రుద్రరాజు రామలింగరాజు హయాం నుంచి ఇప్పటి వరకూ పోరాడుతూనే ఉన్నారు. 1970లో అప్పటి కేంద్రమంత్రి బ్రహ్మదత్ కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కూడా ఇక్కడ శంకుస్థాపన చేశారు. అయితే సాంకేతిక కారణాల వల్ల అది దిండి–చించినాడకు మారింది. అనంతరం 2004 ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నర్సాపురం–సఖినేటిపల్లి వంతెన నిర్మాణానికి వాగ్దానం చేశారు. ఆయన హయాంలో ఎన్నికలకు ముందే ఫ్లోటింగ్ బ్రిడ్జి పేరుతో శంకుస్థాపన కూడా చేశారు. అదీ మరుగునపడింది. అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే ఆయన హఠాన్మరణంతో నిర్మాణం ఆగిపోయింది.



కోనసీమ–పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య రాజుల్లంక–రామేశ్వరం వంతెన, బైపాస్ రోడ్ల నిర్మాణం డిజైన్

తీర ప్రాంత జిల్లాలకు ఎంతో సౌకర్యం

ఇక్కడ వంతెన నిర్మాణం కాకపోవడం వల్ల ప్రతి రోజూ సుమారు 20 వేల మంది ప్రజలు ప్రమాదకరంగా పడవలు, పంట్లపై రేవు దాటి వెళ్తున్నారు. పైగా ఇక్కడ సముద్రం దగ్గర కావడం వల్ల నదిలో సైతం అలల తీవ్రత అధికంగా ఉంటుంది. కృష్ణా జిల్లా మచిలీపట్నం, రేపల్లె నుంచి కోనసీమ జిల్లాలో సఖినేటిపల్లి, ఓడలరేవు, యానాం మీదుగా కాకినాడ వరకూ తీర ప్రాంత గ్రామాలకు ప్రజల రాకపోకలు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల ప్రజల అవసరాలు ముడిపడి ఉన్నాయి. అలాగే నర్సాపురం వైపు వెళ్లే విద్యార్థులు, ప్రజల రాకపోకలు కూడా అధికంగా జరుగుతుంటాయి. వందల ఏళ్లుగా ఇక్కడ వంతెన నిర్మాణం కోసం పోరాటం జరుగుతున్నా.. బూటకపు వాగ్దానాలతో అప్పటి ప్రభుత్వాలు భూమి పూజలు చేసినా శంకుస్థాపనకు ముందే భూసేకరణకు రూ.65 కోట్లు విడుదల చేయించిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. 2021లో సుమారు రూ.400 కోట్లు కేటాయించిన ఈ ప్రాజెక్టుకు తాజా అంచనాలతో రూ.600 కోట్లకు చేరింది.

పనులు వెంటనే ప్రారంభించాలి



మారిన డిజైన్‌తో రామేశ్వరం–రాజుల్లంక మధ్య వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణం కొరకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. టీడీపీ సానుభూతి పరులు వేసిన కోర్టు కేసుల నుంచి విముక్తి కల్పించి వెంటనే పనులు ప్రారంభించాలి. లేకుంటే రూ.600 కోట్ల నిధులు రాబట్టడం ఎవరి వల్లా కాదు. భూసేకరణ పూర్తయింది. వంతెన నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది.

– గొల్లపల్లి సూర్యారావు, మాజీ మంత్రి, రాజోలు

ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం



వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణంతో పాటు, 216 బైపాస్ రోడ్డు నిర్మాణం కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాం. రూ.600 కోట్ల నిధులు మంజూరు అంటే ఆషామాషీ అంశం కాదు. కేంద్రం స్థాయిలో కోర్టు కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. కేసు వేసిన వారితో ఇప్పటికే సంప్రదింపులు జరిగాయి. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయి.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే రాజోలు

క్లుప్తంగా

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

బోల్తాపడిన కారు

గండేపల్లి: స్థానిక జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణ నష్టం తప్పి స్వల్ప గాయాలతో కారులో ప్రయాణిస్తున్న వారు బయటపడ్డారు. గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపిన వివరాల మేరకు మచిలీపట్నం నుంచి కారులో విశాఖ వెళుతుండగా మండలంలోని గండేపల్లి శివారులో ఎన్టీ రాజాపురం వెళ్లే మార్గం వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి రోడ్డుకు మధ్యలో ఉన్న పోల్‌ను ఢీకొట్టి రోడ్డు మధ్యలో బోల్తాపడింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న దిలీప్‌కు స్వల్పగాయాలు కాగా, కొడుకు, భార్య సురక్షితంగా బయటపడ్డారు. కారు పూర్తిగా దెబ్బతింది. ప్రమాదస్థలం వద్దకు చేరుకున్న ఎస్సై తక్షణ సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి కారును పక్కకు పెట్టించారు. కారు రోడ్డుపై బోల్తా కొట్టిన సమయంలో అదే మార్గం నుంచి ఎటువంటి వాహనాలు రాకపోవడం, కారులో బెలూన్‌లు ఓపెన్ కావడంతో ప్రాణనష్టం తప్పిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు: ఒకరి మృతి

నల్లజర్ల: స్థానిక బైపాస్ రహదారిపై దూబచర్ల సమీపాన సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్సై మోహనరావు అందించిన వివరాల ప్రకారం నరసరావుపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన వేమారెడ్డి (35), సాయినాథరెడ్డి(28) తాళ్లపూడి మండలం గోపవరంలోని ఠాగూర్ కెమికల్స్‌లో పనిచేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వేమారెడ్డి కారు డ్రైవ్ చేస్తుండగా సాయినాథరెడ్డి పక్క సీట్లో కూర్చున్నాడు. దూబచర్ల ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి వీరి కారు ముందు వెళ్తున్న కంటైనర్‌ను బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో కారు పైభాగం మొత్తం నుజ్జునుజ్జయింది. వేమారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్సై మోహనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఆనందం.. ఆవిరి

- అర్ధరాత్రి ఉసురు తీసిన అతివేగం
- ఇద్దరు స్నేహితుల మృతి



మజ్జి హరిబాబు (ఫైల్) పాలపర్తి అభినంద్ (ఫైల్)

కాకినాడ రూరల్: అతివేగం, మద్యం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. మృతుల్లో ఒకరికి మేనకోడలు పుట్టడంతో వారిద్దరు మద్యం పార్టీ చేసుకుని ఉత్సాహంగా తిరుగు ప్రయాణమయ్యారు. మద్యం మత్తులో అతివేగం ఇద్దరి ప్రాణాలను హరించింది. రెండు పదుల వయసులోనే వారికి నిండు నూరేళ్లు నిండిపోయాయి. సర్పవరం పోలీసుల వివరాల ప్రకారం .. కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ సమీపాన రమణయ్యపేట చేపల మార్కెట్‌కు సమీపంలో శ్మశాన వాటిక వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో డివైడర్‌ను ఢీకొట్టి వాకలపూడికి చెందిన స్నేహితులు మజ్జి హరిబాబు (20), పాలపర్తి అభినంద్(20) మృతి చెందారు. బైక్ నడుపుతున్న హరిబాబు స్పాట్‌లోనే మృతి చెందగా, సమీపాన ప్రైవేట్ ఆస్పత్రిలో గంట వ్యవధిలో అభినంద్ మృతి చెందాడు. అభినంద్ తండ్రి త్రిమూర్తులు రమణయ్యపేట మార్కెట్ వద్ద బేకరి, స్వీట్ స్టాల్ నిర్వహిస్తున్నాడు. అభినంద్‌కు వరసకు సోదరుడు అయ్యే వీరబాబుకు ఐదు రోజుల క్రితం మేనకోడలు పుట్టడంతో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో స్వీట్ స్టాల్‌లో పనిచేసే వారందరితో పార్టీ జరుపుకొన్నారు. మద్యం తాగి, ఫుడ్ తిని మిగిలిన వారు అర్ధరాత్రి 12 గంటలకు వెళ్లిపోయారు. స్నేహితుడికి చెందిన డ్యూక్-250 స్పోర్ట్స్ బైక్‌పై హరిబాబు, అభినంద్‌లు సుమారు 2.30 గంటల సమసంలో వలసపాకల గంగరాజు నగర్ మీదుగా సర్పవరం జంక్షన్‌కు బయలుదేరారు. రమణయ్యపేట చేపల మార్కెట్ దాటిన తరువాత శ్మశానవాటిక ఎదురుగా మలుపు వద్ద రోడ్డు మధ్యలోని డివైడర్‌ను అతివేగంతో ఢీకొట్టారు. తీవ్ర రక్తస్రావంతో బైక్ నడుతున్న హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు, సమీప ప్రైవేట్ ఆస్పత్రిలో గంట పాటు చికిత్స అనంతరం అభినంద్ మృతి చెందాడు. ప్రమాదం గురించి తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతదేహాలను జీజీహెచ్‌కు తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. అభినంద్ అన్నయ్య శివ సత్యసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్సై శ్రీనివాసకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

అల్లవరం: బోడసకుర్రు టిడ్కో ఇళ్లలో నివాసముంటున్న రెడ్డి నాగేంద్రకుమార్ భార్య సోమవారం ఉదయం తన ఫ్లాట్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అల్లవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిల్లల్ని స్కూల్‌కి పంపించే విషయంలో భార్యాభర్తల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ తలెత్తిందని తెలిపారు. నాగేంద్రకుమార్ సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. నాగేంద్రకుమార్ భార్య అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తుంది. డ్యూటీకి వెళ్లే నిమిత్తం ఆమె స్నేహితురాలు ఫ్లాట్‌కి వచ్చి చూసింది. అదే సయయంలో ఫ్యాన్‌కు వేలాడుతుండడంతో గమనించి స్థానికులను అప్రమత్తం చేసింది. దీంతో స్థానికులు వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వివాహితను రక్షించి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా లాన్‌టెన్నిస్ పోటీలు



మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న ఆతిథ్య తూర్పుగోదావరి జట్టు



వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు

- 13 జిల్లాల నుంచి 260 మంది క్రీడాకారుల హాజరు
- 100 మంది క్రీడాధికారులు
- 28 నుంచి 30 వరకూ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని కాకినాడ డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి కేవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానం లాన్‌టెన్నిస్ కోర్టుల ఆవరణలో రాష్ట్ర స్థాయి 68వ ఏపీ అంతర్ జిల్లాల పాఠశాల క్రీడాసమాఖ్య లాన్‌టెన్నిస్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీవైఈఓ సత్యనారాయణ, గౌరవ అతిథిగా డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, విశిష్ట అతిథిగా ఏపీ లాన్‌టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్‌కుమార్‌లు హాజరయ్యారు. జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి పాఠశాల విద్యార్థుల్లో ప్రతిభను పెంపొందించడాని ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు దోహదపడతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ టెన్నిస్‌లో రాణించాలంటే ఫిట్‌నెస్ చాలా అవసరం అన్నారు. గెలుపోటముల కన్నా ఆటలో పాల్గొనడం, క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవడం ప్రదానమన్నారు. ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే ఈ పోటీల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. 13 జిల్లాల నుంచి 260 క్రీడాకారులు, 100 మంది క్రీడాధికారులు, కోచ్‌లు, మేనేజర్లు, సాంకేతిక సిబ్బంది హాజరయ్యారు. టోర్నమెంట్ పరిశీలకులుగా బాబు, సుబ్రహ్మణ్యం వ్యవహరిస్తున్నారు.



టెన్నిస్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న డీవైఈఓ సత్యనారాయణ తదితరులు

క్రీడాప్రతిజ్ఞ అనంతరం పోటీలు ప్రారంభం

వివిధ జిల్లాల క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ చేసిన తర్వాత అతిథులు గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ ప్రజ్వలన చేశారు. వివిధ జిల్లాల క్రీడాకారులతో డీఎస్‌డీవో క్రీడాప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. కాకినాడ డీఎస్ఏలో అండర్-14, డీమార్ట్ మున్సిపల్ టెన్నిస్ కోర్టుల్లో అండర్-17, టౌన్‌హాల్ టెన్నిస్ కోర్టులలో అండర్-19 విభాగంలో మ్యాచ్‌లను నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు, టోర్నమెంట్ స్పాన్సర్, రాష్ట్ర టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్‌కుమార్, ఎస్‌జీఎఫ్‌ఐ అసిస్టెంట్ కార్యదర్శులు సునీల్, పరశురాం, పీడీలు సూరిబాబు, ఇమ్మాన్యుయేలు రాజు, పి.శ్రీనివాస్, చార్లెస్, నాగు, తదితరులు పాల్గొన్నారు.

కల్ప, అశ్వ వాహనాలపై ఊరేగిన దేవదేవుడు

- ఎనిమిదో రోజు కల్కి అలంకరణలో స్వామి దర్శనం
- నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వార్ని దర్శించుకున్నారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి కల్ప వృక్ష వాహనం, కల్కి అలంకరణతో అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని అంగరంగ వైభవంగా మేళతాళాలతో గ్రామంలో భారీ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివారిని తీర్థ బిందెతో గౌతమీ గోదావరి జలాలను తీసుకు వచ్చి అభిషేకాలతో పాటు గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం నివేదన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వినియోగం చేశారు. స్వామి వారికి పట్టువస్త్రాలను దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు దంపతులు అందజేశారు. బ్రహ్మోత్సవాలను వైఖానస యువబ్రహ్మ, ఆగమ భాస్కర ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఉదయం స్వామికి సంకల్పం, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అష్టకలశారాధన, మహాస్నపనం తదితర పూజలు నిర్వహించి స్వామి వారిని కల్పవృక్షంపై ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, విశేషార్చన, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, చూర్ణోత్సవం, తీర్థప్రసాద వితరణ, కల్కి అలంకరణతో అశ్వ వాహన సేవ తదితర పూజలను ఘనంగా నిర్వహించారు.



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ఈఓ



కల్పవృక్షంపై స్వామి వారు

కల్ప వృక్ష, అశ్వ వాహన సేవ విశిష్టత

కల్పవక్షం నీడన చేరిన వారికి ఆకలి దప్పులుండవు. పూర్వ జన్మస్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తమకు కాసిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. కల్పవక్షం మాత్రం కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అలాగే అశ్వవాహన సేవకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. హిందూ ధర్మంలో ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలుగా వర్ణిస్తున్నాయి.

విశ్వశాంతి కోరుతూ శ్రీపుష్పయాగం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు సోమవారం సంపూర్ణమయ్యాయి. మూడో రోజు స్వామికి, ఉభయ దేవేరులకు అలంకరించిన పవిత్రాలను తీసుకువచ్చి చక్ర పెరుమాళ్లకు సమర్పించారు. శ్రీవారికి ఏకాదశ ఫలరసాలతో అర్చన వేడుకగా జరిగింది. చతుస్థానార్చనలతో ఉత్సవాలను ప్రారంభించి శ్రీపుష్పయాగంతో ముగించారు. 108 కలశాలతో స్వామి, అమ్మవార్లకు శత కలశ స్నపన తిరుమంజన సేవ ఘనంగా నిర్వహించారు. పవిత్ర అవరోహణం, వైకుంఠ పార్శ్వ హవనం, మహా పూర్ణాహుతి, శ్రీవారికి ఏకాదశ ఫల రస స్నపన తిరుమంజనం సేవ ఘనంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం లోక కల్యాణం, విశ్వ కల్యాణం కోరుతూ శ్రీవారి శాంతి కల్యాణం మహోత్సవాన్ని ఆద్యంతం కనుల పండువలా జరిపించారు. ఆలయ ఈవో ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో గుడివాడకు చెందిన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి శిష్య బృందం చలమచర్ల మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చక స్వాముల ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు.



పవిత్రోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న శాంతి కల్యాణం

గోదావరిలో హాస్టల్ వార్డెన్ గల్లంతు



కొండ్రు రామిరెడ్డి (ఫైల్)

కొవ్వూరు: గోపాలపురం ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న కొండ్రు రామిరెడ్డి (58) కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సోమవారం స్నానం చేయడానికి దిగి ప్రమాదవశాత్తూ గోదావరిలో గల్లంతయ్యాడు. ఏలూరు జిల్లా పోలవరంకి చెందిన ఈయన హాస్టల్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్న మర్రి శ్రీనివాస్‌తో కలసి పట్టణంలో యానాదకాలనీలో ప్రైవేటు ఫంక్షన్‌కి వచ్చారు. ఇరువురు వేములూరు రోడ్డులో ఉన్న బార్‌లో మద్యం తాగి, భోజనం అనంతరం గోష్పాదక్షేత్రంలో స్నానానికి వచ్చారు. ఈ సమయంలో రామిరెడ్డి ప్రమాదవశాత్తూ నదిలో గల్లంతయ్యాడు. ఆయన ఆచూకీ కోసం గాలించినప్పటికీ జాడ లభించలేదు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

మలికిపురం: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. మలికిపురం శ్రీరామ్ బ్యాడ్మింటన్ అకాడమీలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల బాల బాలికల అండర్ 14, 17 బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో క్రీడల అభివృద్ధి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచీ వచ్చిన క్రీడాకారులకు అన్ని సౌకర్యాలూ కల్పించామని కలెక్టర్ అన్నారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో క్రీడా స్థలాల అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. లేకుంటే గ్రామీణ క్రీడాకారులకు క్రీడల్లో రాణించేందుకు అవకాశాలు ఉండవన్నారు. ప్రధానంగా ఆటస్థలాల అభివృద్ధికి పాటు పడతామన్నారు. మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. తొలుత జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం పోటీల ప్రారంభం సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. మార్చ్‌ఫాస్ట్‌తో పాటు ఎడ్ల బళ్లపై క్రీడా జ్యోతి ప్రదర్శన నిర్వహించారు.



మలికిపురంలో అండర్ 14, 17 బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించిన కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే వరప్రసాద్

అంతా మాయిష్టం..

మద్యం షాపు కోసం గ్రామస్తులతో తెలుగు తమ్ముడి వివాదం

ముమ్మిడివరం: రాజ్యాంగేతర కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటే ఉపేక్షించేది లేదని టీడీపీ, జనసేన అధినాయకత్వం హెచ్చరిస్తున్నా.. ముమ్మిడివరంలో అధికార పార్టీ నాయకుడు వాటినేమి పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యహరిస్తున్నారు. దీంతో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపిస్తోంది. తాజాగా ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెంలో అన్ని వర్గాల కోసం రూ.4.5 లక్షలతో భూమిని చదును చేసి ఏర్పాటు చేసిన శ్మశాన భూమిలో స్థానిక టీడీపీ కార్యకర్తతో ఆ వార్డు ప్రజాప్రతినిధి మరో మండల స్థాయి నాయకుడు చొరవతో బెల్ట్ షాపు కోసం బడ్డీ పెట్టించగా గ్రామస్తులు ఆ బడ్డీని తొలగించి కంచె వేశారు. దీనిపై ఆ టీడీపీ నాయకుడు బడ్డీని తొలగించి, అడ్డు చెప్పిన వారిపై కేసులు పెట్టించారు. దీంతో ఆ గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలతో పాటు గ్రామస్తులు కలసి తమపై తప్పుడు కేసులు బనాయించారని జిల్లా కలెక్టర్, ఎస్పీ, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ప్రజా ప్రతినిధి వద్దకు తీసుకువెళ్లగా కేసులు వద్దు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించినప్పటికీ ఆ టీడీపీ కార్యకర్త నేను అధికార పార్టీ సభ్యుడినని మేము బెల్ట్ షాపు అక్కడే పెడతామని ఎవరు అడ్డు వస్తారో చూస్తామంటూ దారుణంగా మాట్లాడుతున్నారని మేము ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

ప్రత్తిపాడు: హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ పెద్దాపురం 7వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.చంద్రమౌళీశ్వరి సోమవారం తీర్పునిచ్చారు. ప్రత్తిపాడు మండలం చింతలూరులో భార్యను హత్య చేసిన కేసులో మృతురాలి భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష, అదనంగా మూడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా, జరిమానా చెల్లించలేని పక్షంలో మరో మూడు నెలల జైలు శిక్ష విధించినట్టు ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. ఆయన కథనం మేరకు ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతలూరులో 2014 డిసెంబర్ 29న భార్యాభర్తల గొడవ నేపథ్యంలో కూనిశెట్టి అప్పారావు తన భార్య సుజాత మెడకు చున్నీ బిగించి, హత్య చేశాడు. అప్పట్లో ఎస్సై వై.రవికుమార్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐ జి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టి, ముద్దాయిని అరెస్టు చేశారు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న మీదట నేరారోపణ రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

అక్రమంగా నిల్వ ఉంచిన నల్లబెల్లం స్వాధీనం

కొవ్వూరు: మద్దూరులో సారా తయారీకి వినియోగించే 6,360 కిలోల నల్లబెల్లం నిల్వలను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన బళ్ల వెంకటరమణ, కామన విష్ణుమూర్తితో పాటు రవాణాకు వినియోగించిన ప్యాసింజర్ ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీతానగరం, దేవరపల్లి, వెంకటనగరం, ధవళేశ్వరం, పోలవరం గ్రామాలకు ఆటో ద్వారా సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఇరువురు నిందితుల్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై, హెచ్‌సీలు, ఇతర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

రూ.ఆరు లక్షల విలువైన బాణసంచా స్వాధీనం

రాజానగరం/రాజమహేంద్రవరం రూరల్: రాజానగరం, బొమ్మూరు పోలీసు స్టేషన్ల పరిధిలో బాణసంచా విక్రయాలకు సంబంధించి గొడౌన్లు, దుకాణాలపై భద్రతా ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా సోమవారం నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో రూ.ఆరు లక్షల విలువైన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న సరకును గొడౌన్లలో భద్రపరచి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం, కొంతమూరులో జనావాసాల మధ్య ఒక ఇంటిలో బాణసంచాను నిల్వ ఉంచారని తెలుసుకున్న స్థానిక సీఐ ఎస్పీ వీరయ్యగౌడ్, తన సిబ్బందితో కలసి సోదాలు నిర్వహించారు. జనావాసాల మధ్య ఉన్న ఆ ఇంటిలో బట్టలు దాచుకున్నట్టుగా బీరువా, అల్మార, తదితర ప్రాంతాల్లో బాణసంచాను భద్రపరిచారు. బాణసంచాను విక్రయించేందుకు అనుమతి పొందిన వ్యాపారి ఆ సరకును జనావాసాలకు దూరంగా నిల్వ ఉంచకుండా ఇంట్లోనే నిల్వ చేయడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా జనావాసాల మధ్య బాణసంచా నిల్వ ఉంచడం వలన అనుకోని ప్రమాదం జరిగితే ఊహించరాని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానిక సీఐ అన్నారు.

ఈ కారణంగానే ఆ సరకును స్వాధీనం చేసుకుని, రాధేయపాలెం సమీపాన ఉన్న ఒక గొడౌన్‌లో భద్రపర్చడంతో పాటు ఆ వ్యాపారికి నోటీసు జారీ చేశామన్నారు. అలాగే బొమ్మూరు పోలీసు స్టేషను పరిధిలోని స్వరూపానగర్‌లో కూడా ఒక ఇంటిలో నిల్వ ఉంచిన బాణసంచాను బొమ్మూరు పోలీసులు పట్టుకున్నారు. బాణసంచాను నిల్వ ఉంచడం, తయారు చేయడం, క్రయ, విక్రయాలు సాగించడం వంటి వాటిలో వ్యాపారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఎస్పీ నరసింహకిషోర్ అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



కొంతమూరులోని ఒక ఇంట్లో నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రాష్ట్ర స్థాయి జు-జిట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్: నెల్లూరు జిల్లా కావలిలో ఈనెల 26, 27 తేదీల్లో జరిగిన ఐదవ రాష్ట్ర స్థాయి జు జిట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో అమలాపురం విద్యార్థులు ప్రతిభ చాటారని స్థానిక ఆ క్రీడ కోచ్ పడాల అంజి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న పది మంది విద్యార్థులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకుని జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. పోటీలు అండర్-10, 12, 14, 16 విభాగాల్లో జరిగాయని పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థుల వివరాలను పడాల అంజి అమలాపురంలో సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించారు. అండర్-10 లో 23 కేజీలో ఫైటింగ్ విభాగంలో జి.వాసవిక్ కృష్ణసాయి, 37 కేజీల నివాజ విభాగంలో ఎస్.సాకేత్ నందన్ స్వర్ణ పతకాలు సాధించారు. అండర్-10లో 32 కేజీల ఫైటింగ్ విభాగంలో పి.ధన్యశ్రీ, అండర్-10లో 38 కేజీల ఫైటింగ్ విభాగంలో ఎస్.వర్షిత్ జై సూర్య, అండర్-10లో 30 కేజీల ఫైటింగ్ విభాగంలో వి.ఎడ్విన్ జోష్ రజత పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్-12లో 34 కేజీల ఫైటింగ్ విభాగంలో వి.గురుచరణ్, అండర్-12 లో 37 కేజీల విభాగం ఫైటింగ్ విభాగంలో జి.తనీష్‌నాయుడు స్వర్ణ పతకాలను పొందారు. అండర్ -14లో 60 కేజీల ఫైటింగ్ విభాగంలో ఎస్.వెంకట కరుణ షణ్ముఖ, అండర్-14లో 43 కేజీల నివాజ విభాగంలో ఎ.రవిశంకరి స్వర్ణ పతకాల్ని కైవసం చేసుకున్నారు. అండర్-16 52 కేజీల ఫైటింగ్ విభాగంలో బి.సౌమ్యరాణి స్వర్ణ పతకాన్ని సాధించింది. ఈ పోటీలకు రిఫరీగా ఎ.నాగ దుర్గారావు వ్యవరించారు. వచ్చే డిసెంబర్‌లో ఉత్తరాఖండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అమలాపురం నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన ఈ పది మంది విద్యార్థులు అర్హత సాధించారని పడాల అంజి తెలిపారు.



జాతీయ పోటీలకు అర్హత సాధించిన అమలాపురం విద్యార్థులతో క్రీడా కోచ్‌లు, రిఫరీలు